# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

సోమవారం 31-7-2023




## రైల్లో కాల్పులు..
## నలుగురి మృతి

**ముంబై, జూలై 31(తెలుగుప్రభ):**

జైపూర్ – ముంబై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైలులో కాల్పులు జరిగాయి. రైలు నడుస్తుండగానే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)కు చెందిన ఓ పోలీసు తన వద్దనున్న తుపాకీతో కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆర్‌పీఎఫ్‌కే చెందిన ఏఎస్ఐతో సహ నలుగురు మృతి చెందారు. ఇవాళ ఉదయం 5 గంటలకు పాల్ఘర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కాల్పులు జరిపిన పోలీస్‌ను చేతన్‌సింగ్‌గా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసిన పోలీసులు బోరివలి పీఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కాల్పులకు కారణాలేమిటో తెలియరాలేదు.





# అదృశ్యం

| వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిస్సింగ్ కేసులు | | |
|---|---|---|
| రాష్ట్రం | మహిళలు | బాలికలు |
| మధ్యప్రదేశ్ | 1.60 లక్షలు | 38,000 |
| పశ్చిమబెంగాల్ | 1.56 లక్షలు | 36,000 |
| మహారాష్ట్ర | 1.78 లక్షలు | 13,000 |
| ఒడిశా | 0.70 లక్షలు | 16,000 |
| ఢిల్లీ | 0.61 లక్షలు | 22,000 |
| జమ్మూకాశ్మీర్ | 86.17వేలు | 1,148 |

మాయమవుతున్న మహిళలు
రెండు తెలుగురాష్ట్రాల్లో 72 వేల మంది..
మరోవైపు చిన్నారుల అక్రమ రవాణా

**న్యూఢిల్లీ, జూలై 31(తెలుగుప్రభ):**

ఆకాశంలో సగం అంటూ మహిళల గురించి మాటలెన్ని చెప్పుకున్నా, అంతరిక్ష ప్రయోగాల్లో వారు భాగస్వాములవుతున్నా, అది కొద్ది శాతం మాత్రమే. అచేతనంగా, నిస్సహాయులుగా సమిధలవుతున్న మహిళలు గణనీయంగానే ఉన్నారు. మణిపూర్ మారణ కాండలోనూ మహిళలే బలి పశువులు కావడం తెలిసిందే. లెక్కలోకి వస్తున్న దారుణాలు కొన్నే కాగా, రికార్డులకెక్కని వివరాలు ఎన్నో! వయస్సుతో సంబంధం లేకుండా బాలికలతో సహా అదృశ్యమవుతున్న ఘటనలు, చిన్నారుల అక్రమ రవాణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

### 13లక్షల మంది మిస్సింగ్

కేంద్రప్రభుత్వ గణాంకాల మేరకు గడిచిన మూడేళ్ల కాలంలో 13 లక్షల మందికి పైగా మహిళలు మాయమై పోయారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల మేరకు ఒక్క మధ్యప్రదేశ్‌లోనే 1.60 లక్షల మహిళలు, 38వేల మంది బాలికలు అదృశ్యమయ్యారు.

### తెలుగు రాష్ట్రాల్లో ..

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అదృశ్యమైన బాలికలు, మహిళలు తక్కువేం లేరు. రెండు రాష్ట్రాల్లో గడిచిన మూడేళ్లలో 72,767 మంది అదృశ్యం కాగా, వీరిలో 56,773 మంది మహిళలు, 15,994 మంది బాలికలు ఉన్నారు.

### ఆందోళనకరంగా చిన్నారుల అక్రమ రవాణా

2016–22 మధ్య కాలంలో చిన్నారుల అక్రమ రవాణా( చైల్ ట్రాఫికింగ్)లోనూ ఏపీ మూడో స్థానంలో ఉండటం భయం గొలుపుతోంది. బీహార్,ఉత్తరప్రదేశ్‌ల తర్వాతి స్థానంలో ఏపీ ఉంది. నగరాల వారీగా చూస్తే రాజస్థాన్‌లోని జైపూర్ మొదటిస్థానంలో ఉంది. ఏపీలోని గుంటూరు ఆరో స్థానంలో ఉంది. బిహార్‌లో 4245 కేసులు నమోదు కాగా, ఉత్తరప్రదేశ్‌లో 3836 కేసులు నమోదయ్యాయి. ఏపీలో 734 కేసులు నమోదు కాగా, గుంటూరులో 208, నెల్లూరులో 125,శ్రీకాకుళంలో 98,కర్నూలులో 74, భీమవరంలో 28 కేసులు నమోదయ్యాయి. ఈ ఆరేళ్ల కాలంలో జైపూర్‌లో 1,115 మంది పిల్లలను రక్షించగా, నార్త్ ఢిల్లీట్ల 856 మంది, నార్త్‌వెస్ట్ ఢిల్లీలో 643, లూధియానాలో 563, నార్త్‌ఈస్ట్ ఢిల్లీలో 631, గుంటూరులో అక్రమ రవాణా కాకుండా కాపాడారు.

కట్టుబానిసలుగా అక్రమ రవాణా ద్వారా తరలిస్తున్న చిన్నారులను వివిధ పరిశ్రమల్లో పనులు చేసేందుకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హోటళ్లు,దాబాల్లో వీరితో బండ చాకిరీ చేయిస్తున్నారు. తర్వాతి స్థానాల్లో ఆటోమొబైల్, రవాణా రంగాలున్నాయి.

### సేఫ్‌సిటీ ప్రాజెక్ట్

ఈ నేపథ్యంలో మహిళల రక్షణ కోసం సేఫ్‌సిటీ ప్రాజెక్టు వంటివి అమలు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. తొలిదశలోహైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్,బెంగళూరు, చెన్నయ్, ఢిల్లీ, కోల్‌కత్తా, లఖ్‌నవూ, ముంబై నగరాలకు ఈ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసినట్లు తెలిపింది.



## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై
## కేసులు

**న్యూఢిల్లీ, జూలై 31(తెలుగుప్రభ):**

**మణిపూర్‌లో నగ్న ఊరేగింపు బాధిత మహిళలిద్దరు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును సుమోటోగా స్వీకరించి సుప్రీంకోర్టు న్యాయబద్ధంగా నిష్పక్షపాతంగా విచారణ జరపాల్సిందిగా అభ్యర్థించారు.**



## మంత్రివర్గ సమావేశం
# మధ్యాహ్నం 2 గంటలకు

**హైదరాబాద్, జూలై31(తెలుగుప్రభ):**

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని భారీ వర్షాలు, పంట నష్టంలతో సహ దాదాపు 25 అంశాలపై మంత్రిమండలిలో చర్చించనున్నారు. త్వరలోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో పలు కీలక అంశాలకు సంబంధించి ఈ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకోనున్నారు. మెట్రోరైలు మార్గం విస్తరణ, వరంగల్ ఎయిర్‌పోర్టు, బుద్వేల్‌లోని 200 ఎకరాల ప్రభుత్వ భూముల విక్రయం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణలతోపాటు వివిధ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆగస్ట్ మూడో తేదీనుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా చర్చించే అవకాశాలున్నాయి.

## బంగారం కోసం
## వృద్ధురాలి హత్య

### ఓ వలంటీర్ ఘాతుకం

**విశాఖపట్టణం, జూలై 31 (తెలుగుప్రభ)**

విశాఖ జిల్లా పెందుర్తిలో దారుణం జరిగింది. 72 ఏళ్ల వృద్ధురాలిని హత్య చేసి బంగారంతో పరారయ్యాడు ఓ వలంటీర్. విశాఖ సుజాతనగర్ సచివాలయం పరిధిలో వెంటక్ అనే యువకుడు 95వ వార్డు పురుషోత్తంపురంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. పార్ట్‌టైం చికెన్ షాపులో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణంలో వచ్చిన కలెక్షన్ ఇంట్లో ఇవ్వాలని వెంకట్ కు ఓనర్ పురామయించాడు. ఓనర్ ఇంటికి వెళ్లిన వెంకట్ తలుపుతట్టగా ఓనర్ తల్లి వరలక్ష్మి (72) తలుపు తీశారు. ఆమె ఒంటిపై బంగారం చూసిన వెంకట్ హత్య చేసి బంగారంతో ఉడాయించాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు.



## చివరి నిజాం
## మనవడి మృతి

**హైదరాబాద్, జూలై 31(తెలుగుప్రభ):**


హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మనవడు ప్రిన్స్ షాహమత్‌ఝా (70) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం రాత్రి కన్నుమూశారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ కుమారుడు మోజంఝా రెండో భార్య అన్వరీబేగం కొడుకు షాహమత్‌ఝా. ఈయన సైతం రెండు పెళ్లిళ్లు చేసుకున్నప్పటికీ, ఇద్దరు భార్యల నుంచి విడిపోయారు. పిల్లలు లేరు. బంజారాహిల్స్‌లోని తన సోదరి ఇంట్లో ఉంటున్నారు. షాజీ అనే కలం పేరుతో కవిత్వం రాసేవారు.



## రెండు తెలుగు రాష్ట్రాల్లో
## మరో వందేభారత్

**హైదరాబాద్, జూలై 31(తెలుగుప్రభ):**

రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఇప్పటికే రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుండగా, రెండు రాష్ట్రాల మీదుగా మరో వందేభారత్ రైలు పరుగుLలు తీయనుంది. హైదరాబాద్ కాచిగూడ స్టేషన్ నుంచి కర్నాటక యశ్వంత్‌పూర్ వరకు కొత్త వందేభారత్ ప్రయాణించనుంది. ఆగస్ట్ 6న ఈ రైలు ప్రారంభం కానుంది. దీని ప్రారంభోత్సవం గుంతకల్ డివిజన్‌లోని డోన్‌లో జరగనున్నట్లు గుంతకల్ రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ద్వారా రెండు ప్రధాన టెక్‌హబ్‌లను కలిపినట్లవుతుందని అధికారులు భావిస్తున్నారు. సికింద్రాబాద్ – పుణే నగరాల మధ్య మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపే యోచనలోనూ రైల్వే అధికారులున్నారు.



## రేపు మళ్లీ
## భారీ వర్షం

**హైదరాబాద్, జూలై 31(తెలుగుప్రభ):**

కాస్త విరామమిచ్చిన వరుణుడు మళ్లీ తన ప్రతాపం చూపనున్నాడు. సోమవారం ఓ మోస్తరు వర్షాల నుంచి మొదలై మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు తెలిపింది.

## బీజేపీలోకి మాజీ
## ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, జూలై 31 (తెలుగుప్రభ)**

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు సంజీవరావు, శ్రీదేవి బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు కిషన్ రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రెండ్రోజుల క్రితం రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డితో పాటు మరికొందరు నేతలు ఢిల్లీ కషాయ కండువా కప్పుకున్నారు. సినీనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ సైతం బీజేపీ గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు. తాజాగా.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. సోమవారం ఉదయం చెన్నూరు మాజీ ఎమ్మెల్యే సంజీవరావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కాషాయ కుండువా కప్పుకున్నారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి..సంజీవరావు, శ్రీదేవి సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని తెలిపారు. సమిష్టి కృషితో బీఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి వస్తామని అన్నారు.